క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు, నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రి ముచ్చాల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబాల శ్రీశైలం మాట్లాడుతూ... కార్మికుల ప్రమాద బీమాను రూ. 6లక్షల 30వేల నుంచి రూ.10లక్షలకు, నార్మల్‌డెత్ బీమాను రూ.2లక్షల 30 వేల వరకు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నవీన్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణారెడ్డి ,ఆత్మ కమిటీ డైరెక్టర్ రవి, కార్మిక సంఘం నాయకులు నర్సింహులు, సుధాకర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు

హుస్నాబాద్‌రూరల్: పిడుగుపాటుకు గురై మూగజీవి మృత్యువాత పడింది. వివరాలు ఇలా.. మండలంలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన కుందేళ్ల సంపత్ గురువారం తన పాడి ఆవును వ్యవసాయ బావి దగ్గర మేతకు కట్టేసి యూరియా బస్తాల కోసం హుస్నాబాద్‌కు పోయాడు. ఎరువు దొరకపోవడంతో రాత్రి ఇంటికి వచ్చి పాలు తీసేందుకు ఆవు దగ్గరకు వెళ్లాడు. వర్షంతోపాటు పడిన పిడుగుపాటుకు గురై ఆవు మృత్యువాత పడి వరద నీటిలో ఉందని బాధిత రైతు గుర్తించాడు. దీంతో రూ.80వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పందుల స్వైర విహారం



పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న పందులు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో సర్కారు అన్ని వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. అయితే పాఠశాలలో సుమారు 370 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆవరణలో మురికి గుంటలు ఏర్పడటంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. విద్యార్థులు టాయిలెట్ కోసం బయటకు వెళ్లాలంటే పందులు దాడి చేస్తాయని జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పందుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

గ్రామ పాలన అధికారుల నియామకం : తహసీల్దార్



తహసీల్దార్ సరిత

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని 20 రెవెన్యూ గ్రామాలను 11 క్లస్టర్లుగా విభజించి జీపీఓ (గ్రామ పాలన అధికారులను) నియమించామని తహసీల్దార్ సరిత తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు అందించేందుకు వీరు సహకరిస్తారన్నారు. నంగునూరు, సిద్దన్నపేటకు దేవరాజ్, పాలమాకులకు మమత, గట్లమల్యాల, సంతోష్‌నగర్‌కు రమేశ్, కొండంరాజ్‌పల్లి, ఖాతాకు ఎస్ మమత, గణపూర్, అక్కేనపల్లికి శ్రీనాథ్, బద్దిపడగ, దర్గపల్లి, జేపీతండాకు జీ.రమేశ్, ఖానాపూర్, అంక్షాపూర్, నాగరాజుపల్లికి ఆంజనేయులు, నర్మెట, అప్పలాయిచెర్వు, మైసంపల్లికి సాయిలు, మగ్దుంపూర్, రాంపూర్‌కు రవీందర్, కోనాయిపల్లి, వెంకటాపూర్, తిమ్మాయిపల్లి గ్రామాలకు జీపీఓలను నియమించామని తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం

దౌల్తాబాద్ (దుబ్బాక) : తరగతి గదిలోని విద్యార్థి జీవితంలో సాంఘిక ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమైందని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనిల్ మాట్లాడుతూ పాఠశాల తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్ నవీన్ కుమార్, భాస్కర్ రెడ్డి, రాజు, కిషన్ రెడ్డి, రవీందర్, సత్య నారాయణ, శ్రీనివాస్, సీఆర్పీ రాజు పాల్గొన్నారు.

మోడల్ హౌస్ పూర్తయ్యేనా!



అప్పటి ఇన్‌చార్జి మంత్రి సురేఖ ప్రారంభించిన మోడల్ ఇల్లు



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

నంగునూరు(సిద్దిపేట): అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లు. అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా ప్రారంభమైన భవనం నేటికీ పూర్తి కాకపోవడం వారి పని తీరుకు అద్దం పడుతోంది. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో ఇల్లు ఎలా నిర్మించాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంత్రి జనవరి 18న మోడల్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. లెంటల్ లేవల్ వరకు నిర్మాణం పూర్తి చేశారు. ఎనిమిది నెలలు గడిచినా నిర్మాణం పూర్తి కాకపోవడం గమనార్హం.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్ ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ నరసింహులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఏసీపీ నరసింహులు సూచించారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సోషల్‌మీడియా, సైబర్ క్రైమ్స్, మైనర్ డ్రైవింగ్, షీటీమ్ విధులు, డయల్ 100 ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, అధ్యాపకులు, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

గజ్వేల్‌రూరల్: రక్తదానం చేయడం వల్ల అత్యవసర సమయంలో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా వైద్యాధికారి ధనరాజు, ఆర్డీవో చంద్రకళ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 30మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఎన్నో శస్త్ర చికిత్సలలో, ప్రమాదం జరిగినప్పుడు, డెలివరీ సమయాల్లో, సీజనల్ వ్యాధుల బాధితులకు రక్తం ఎంతో అవసరముంటుందన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో రాము, వైద్యులు రాజేశ్, మంజుల, భవాణి, సిబ్బంది సువర్ణ, శివకిశోర్, విద్యాసాగర్, దేవేందర్, ఉమ, మెహరాజ్, భాను, లక్ష్మీ, వాసుదేవ్ పాల్గొన్నారు.

ముస్లింల శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో ముస్లింలు

గజ్వేల్: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గజ్వేల్‌లో ముస్లింలు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి గుండా ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రవక్తను కొనియాడుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తంజుముల్ మసాజిద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతిన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గశాఖ అధ్యక్షుడు అజహార్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

మద్దూరులో దంచికొట్టిన వాన

పలు చోట్ల నిలిచిన రాకపోకలు



మత్తడి దూకుతున్న దూల్మిట్ట చెక్‌డ్యాం



నల్ల చెరువు మత్తడి దూకడంతో కూటిగల్ నుండి తరిగొప్పులకు నిలిచిపోయిన రాకపోకలు

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మద్దూరు మండలంలో గురువారం సాయంత్రం నుంచి ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో దూల్మిట్ట చెక్ డ్యామ్, గాగిళ్లాపూర్ పెద్ద చెరువు, కూటిగల్‌లోని నల్ల చెరువులు మత్తడి దూకుతున్నాయి. దీంతో దూల్మిట్ట, బైరాన్‌పల్లి గ్రామాలకు, గాగిళ్లాపూర్ నుండి చేర్యాలకు, కూటిగల్ నుండి తరిగొప్పులకు రాకపోకలు నిలిచిపోయాయి. గాగిళ్లాపూర్‌లో వాగు వద్దకు వెళ్లకుడా పోలీసులు ట్రాక్టర్లను అడ్డుగా పెట్టారు. చెరువులు, వాగుల వద్దకు వెళ్లవద్దని పోలీసులు, రెవెన్యూ అధికారులు సూచించారు.

విద్యార్థి ఇంటి వద్దకే వెళ్లి బోధన



విద్యార్థుల ఇంటికి వెళ్లి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు అనీల్

కోహెడరూరల్(హుస్నాబాద్): వర్షం కారణంగా పాఠశాలకు రాలేకపోయిన విద్యార్థులను చదువులో వెనకబకుండా ఉపాధ్యాయుడు చొరవ చూపాడు. మండలంలోని వింజపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు అనీల్ గ్రామంలో వర్షం కురవడంతో కల్వర్టు ప్రవహిస్తుంది. దీంతో విద్యార్థులు పాఠశాలకు రాకపోవడంతో ఇళ్లకు వెళ్లి పాఠాలు బోధించాడు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తపన పడుతున్న ఆయన కృషిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ముస్త్యాల సబ్ స్టేషన్‌లో జరిగే మరమ్మతుల కారణంగా అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సింగిల్ ఫేస్ కరెంటు అందిస్తామని తెలిపారు.

కొమురవెల్లి మండలంలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట, కొమురవెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ మధు ఒక ప్రకటనలో తెలిపారు. ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని కొమురవెల్లి, గౌరయపల్లి, కిష్టంపేట, రాంసాగర్, అయినాపూర్, గురువన్నపేట, తపాస్‌పల్లి, పోసాన్‌పల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్‌ను నిలిపివేసి సింగిల్‌ఫేస్‌ను సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

గుంతల రోడ్డును బాగుచేయండి

ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

గజ్వేల్: మండలంలోని అహ్మదీపూర్ గ్రామం నుంచి గజ్వేల్–వెంకట్రావ్‌పేట్‌కు రావడానికి నిర్మించిన రహదారి అధ్వాన్నంగా మారింది. ఈ రోడ్డును వెంటనే బాగు వెంటనే చేయాలని శుక్రవారం గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ, ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోనే పెద్ద గ్రామమైన అహ్మదీపూర్‌కు 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. గ్రామ నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికిన వారికి నోటీస్

సాక్షి ఎఫెక్ట్..

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండంలోని ముద్దాపూర్ గ్రామ శివారులో రోడ్డు ప్రక్కన హరితహారం చెట్లను నరికిన సీడ్ కంపెనీని గుర్తించిన అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ముద్దాపూర్ నుంచి కొడకండ్లకు వెళ్లే దారి వెంబడి చెట్లను నరికివేయడంతో హరితహారం చెట్ల నరికివేత అనే శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో ఎంపీడీఓ రాంప్రసాద్ సూచనల మేరకు సీడ్ కంపెనీకి నోటీసులు జారీ చేశారు. అలాగే అటవీశాఖ అధికారులు సైతం నరికిన చెట్లను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నివేదిక ఆధారంగా జరిమానా కట్టాల్సి ఉంటుందని అటవీశాఖ అధికారి ముజీబ్ పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్వచ్ఛత , పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఎన్‌సీసీ పోగ్రాం కో ఆర్డినేటర్ సరిత, ప్రసన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట, హైదరాబాద్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

అక్కన్నపేటను అభివృద్ధి చేస్తా

- గిరిజన శాఖ ద్వారా రూ.10కోట్లు మంజూరు
- మంత్రి పొన్నం ప్రభాకర్



బొడిగెపల్లిలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొడిగెపల్లి, మంచినీళ్లబండ గ్రామాల్లో నిర్మించిన నూతన జీపీ భవనాలను ప్రారంభించారు. అలాగే మల్లంపల్లి నుంచి తాళ్లతండా వరకు రూ.2.40కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు, మల్లంపల్లి–చౌటపల్లి గ్రామ శివారులో రూ.కోటితో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం, యటకార్లపల్లి నుంచి మంచినీళ్లబండ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీల గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.10కోట్ల నిధులు రోడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు కింద కాలువల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, ఆర్డీఓ రామ్మూర్తి, పంచాయతీరాజ్ డీఈ మహేశ్, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అయిలయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేశ్, సంజీవ్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ మోహన్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

దిగుమతులు లేకే యూరియా కొరత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): చైనా నుంచి యూరియా దిగుమతి లేకనే యూరియా కొరత ఏర్పడిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు రూ.11లక్షల 70 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత ఒక్క మన రాష్ట్రానికే కాదని దేశమంతా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ దామోదర్, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి,పోచయ్య,శ్రీనివాస్‌రెడ్డి,నర్సయ్య పాల్గొన్నారు.

ఎరువు లేక ఎదగని చేను

మొక్కజొన్న చేనులో ఎద్దులను మేపిన రైతు



మొక్కజొన్న చేనులో పశువులను మేపుతున్న దృశ్యం

దౌల్తాబాద్ (దుబ్బాక) : యూరియా సకాలంలో అందక మొక్కజొన్న చేను ఎదుగుదల లేక ఎర్ర పడటంతో చేసేది ఏమీ లేక రైతు పశువులను మేపాడు. మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన దాతగల బాలయ్య ఒక ఎకరం మొక్కజొన్న చేను సాగు చేశాడు. మొదటి దఫాగా చేనుకు యూరియా అందక ఎర్రబడి ఎదగలేదు. దీంతో శుక్రవారం రైతు పశువులను కట్టేసి మేపాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ యూరియా సకాలంలో అందక పంటను పశువులకు మేతగా వేయవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

మార్గదర్శకాల మేరకు పత్తి కొనుగోలు



మాట్లాడుతున్న కలెక్టర్ కె.హైమావతి

అధికారులతో కలెక్టర్

సిద్దిపేటరూరల్: జిల్లాలో పత్తి కొనుగోలులో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పత్తిని కొనుగోలు చేపట్టాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో పత్తి కొనుగోలుపై అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల నుండి వచ్చే ఏడాది మార్చి వరకు పత్తి కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన ధరకు పత్తి కొనుగోలు చేయాలని అధికారులను, పత్తి మిల్లుల యజమానులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, మార్కెటింగ్ డీఎం నాగరాజు, జిల్లా అధికారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, సీసీఐ అధికారులు పాల్గొన్నారు.

వంతెనను పరిశీలించిన కలెక్టర్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలో నిన్న కురిసిన వర్షానికి కోహెడ నుండి నారాయణపూర్ వెళ్లే రోడ్ లో–లెవెల్ వంతెన పైనుండి నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో కలెక్టర్ హైమావతి పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి ప్రవాహం తగ్గే వరకు మానిటర్ చేయాలని, రాకపోకలను నిలిపివేయాలని ఆదేశించారు.

జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

సిద్దిపేటరూరల్: జిల్లాను వైద్యం రంగంలో ముందు వరుసలో నిలిపేలా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మండలాల మెడికల్ అధికారులతో పీహెచ్‌సీల ప్రగతిపై సమీక్షించారు. సీజనల్ వ్యాధుల ప్రభావంపై ప్రజల కు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడల్లో ఖోఖో క్రీడా పోటీల్లో జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ స్లీవరాజ్ క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనలో, దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. శుక్రవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు శకుంతల రెడ్డి, అరుణ, శివ ప్రసాద్, రాజమణి, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ మనీల, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, శివయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తహసీల్దార్‌కు వినతి

మద్దూరు(హుస్నాబాద్): ఫొటోగ్రాఫర్స్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ రహీంకు మండల ఫొటోగ్రాఫర్లు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్‌కు కమ్యూనిటీ భవనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

◆ చట్టాలపై అవగాహన ఉండాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ వెంకట్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల రక్షణ చట్టాలు, మత్తు పదార్థాలు, సైబర్ నేరాల గూర్చి అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ 15న ఎమ్మార్పీఎస్ ధర్నా

చిన్నకోదూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం పెన్షన్‌లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెర్క పర్శరాములు తెలిపారు. శుక్రవారం చిన్నకోడూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు మల్లేశం, బాబు, ఆనంద్, రవి, శేఖర్ తదితరులు ఉన్నారు.

◆ బీఆర్ఎస్ పాలనలోనే నిరుద్యోగం

చిన్నకోదూరు(సిద్దిపేట): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క నోటిఫికేషన్ వేయకుండా నిరుద్యోగుల ఉసురు తీసిందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ వేసి మళ్లీ కోర్టులకు వెళ్లిన చరిత్ర బీఆర్ఎస్‌ది అన్నారు. నాయకులు మహేందర్ రెడ్డి, వెంకట్, నర్సింలు, రాజు ఉన్నారు.

◆ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 15, 16వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భిక్షపతి తెలిపారు. బీఏలో 89, బీకాంలో 69, బీఎస్సీ బీజెడ్‌సీలో 30, బీఎస్సీ ఎంపీసీఎస్‌లో 32 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటఎడ్యుకేషన్: డిగ్రీలో చివరి విడుతలో భాగంగా స్పాట్ అడ్మిషన్స్ చేపట్టనున్నట్లు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ తెలిపారు. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 15, 16 తేదీల్లో డిగ్రీలో విద్యనభ్యసించేందుకు దోస్త్ ద్వారా స్పాట్ అడ్మిషన్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనిత అబ్రహం తెలిపారు. కళాశాలలో బీఏ(ఇంగ్లిష్ మీడియం) 25, బీఏ(తెలుగు మీడియం) 51, బీబీఏ 50, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ 73, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ 61, బీఎస్సీ లైఫ్ సైన్స్ 14, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ 54 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

◆ దరఖాస్తు తేదీ గడువు పొడిగించాలి

సిద్దిపేటజోన్: బీడీ కార్మికుల పిల్లలకు అందించే స్కాలర్ షిప్ దరఖాస్తు తేదీని పొడిగించాలని తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బీడీ సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. దరఖాస్తు చివరి గడువు ఈనెల 15తో ముగియనుందని, నెట్‌వర్క్ సమస్య వల్ల చాలా మంది దరఖాస్తు చేసుకోలేదన్నారు. దరఖాస్తు తేదీని నవంబర్ చివరి వరకు పొడిగించాలని కోరారు.

◆ పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు

హుస్నాబాద్: పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు జరిగిందని, కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని లబ్ధిదారులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో 11వ వార్డు లబ్ధిదారులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులు లక్ష్మి, చంద్రకళ, రుక్మిణి పాల్గొన్నారు.

◆ యూరియా పంపిణీపై విచారణ జరపాలి

హుస్నాబాద్: అధికారుల నిర్లక్ష్యంతోనే యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంత మంది ఫర్టిలైజర్ యజమానులు యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వికాస్ యాదవ్, సత్యం నాయక్, కృష్ణ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.